
సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 10 । ఆగస్టు । 2023



ఒక్క మాత్రతో 'నులి'మేద్దాం

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా జిల్లాలో అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

-8లో..



ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

ఇద్దరు మహిళా దొంగలను బుధవారం కడప పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

-8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.5/27.9

జిల్లాలో బుధవారం 27.9 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు సఫాయి కర్మచారీస్ చైర్మన్ రాక

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ సఫాయి కర్మచారీస్ చైర్మన్ వెంకటేశన్ ఈ నెల 11 జిల్లా పర్యటనకు వస్తున్నారని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అగస్టు 11వ తేదీన ఉదయం 10:25 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 11.25 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సఫాయి కర్మచారుల సమావేశం లో పాల్గొంటారని తెలిపారు. రాత్రికి కడపలో బస చేస్తారన్నారు ఈ సమావేశంలో ఎస్పీ, కడప మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్,జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటారన్నారు. మరుసటిరోజు ఉదయం 9 గంటలకు కడప నుండి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారన్నారు.

పసుపు ధర క్వింటా రూ.11,789




కడప మార్కెట్‌యార్డుకు అమ్మకానికి వచ్చిన పసుపు

కడప అగ్రికల్చర్: పసుపు ధర రోజురోజుకు పైపైకి పాకుతోంది. వారం రోజుల క్రింత క్వింటా రూ. 9 వేలలోపు ఉన్న ధర క్రమేపీ పెరుగుతూ రూ. 11,789కు చేరింది. కడప మార్కెట్‌యార్డులో గురువారం ఫింగర్ పసుపు క్వింటా అత్యధికంగా 11218 పోగా బల్బ్ రకం క్వింటా రూ. 11789 పలికింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో ఇంత ధర ఎన్నడూ లేదని పలువురు రైతులు తెలిపారు. కడప మార్కెట్‌యార్డులో క్వాలిటీని బట్టి ఫింగర్, బల్బ్ రకం క్వింటా రూ. 10,500 నుంచి 11,789 వరకు ధర పలికింది.బుధవారం 100 క్వింటాళ్ల ఫింగర్, 157 క్వింటాల్ బల్బ్ రకం పసుపు అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ యార్డు సెక్రటరీ బాల వెంకటరెడ్డి తెలిపారు.

23 నుంచి తెలుగు భాషా దినోత్సవాలు

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29 వరకు నిర్వహించనున్న తెలుగుభాషా దినోత్సవాలకు సంబంధించి నాలుగు జిల్లాల బాధ్యతను వైఎస్సార్ జిల్లాకు చెందిన అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అప్పగించారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయ్‌బాబు ఈ మేరకు ఆయనకు అధికారికంగా బాధ్యతలను అప్పగించారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవంగా వారం రోజులపాటు రాష్ట్ర మంతటా ఘనంగా నిర్వహించనుంది. ఆయా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారు. వైఎస్సార్, నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఉత్సవాలు నిర్వహించే బాధ్యతను డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అప్పజెప్పారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వారం రోజుల్లో ప్రతిజిల్లా నుంచి కొందరు ప్రముఖులను ఎంపిక చేసి ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం పక్షాన రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందజేసే బాధ్యతను వెంకటయ్యకు అప్పగించారు.

ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్‌ఓ, డీవైఈఓ, సైన్సు ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తులు చేయాలని జిల్లా సైన్సు అధికారి ఓబుల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి సైన్సు ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనక్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 31వతేదీలోపు నామినేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్లు తప్పకుండా చేయించాలన్నారు. రేడీమేడ్ నమూనాలను అనుమతించమని స్పష్టం చేశారు. చిన్నారుల మది నుంచి వచ్చిన ఆలోచనలను కార్యరూపం దాల్చేవిధంగా ఉండే వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శనకు ఎంపిక చే యాలన్నారు. రు. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా,మేకిన్ ఇండియా, స్వస్థభారత్, స్వచ్ఛభారత్ అనే ప్రధాన అంశాలతో తయారు చే యాలన్నారు. డివైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓలు ప్రభాకరెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, డివిజన్ రిసోర్సుపర్సన్ భాస్కరన్, శాస్త్రి పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు పెళ్లి కానుక

జిల్లాలో 616 జంటలకు రూ. 4.82 కోట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివ ప్రసాద్ రెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కానుకలు వైఎస్ఆర్ షాదీ తోఫా, కల్యాణమస్తు పథకాలని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం మూడవ విడత ఆర్థిక సాయాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్ కుమార్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు హిదాయతుల్లా, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్ రెడ్డిలు వీక్షించారు.

వీసీ ముగిశాఖ ఈ పథకానికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూన్ 30 మధ్య కాలంలో వివాహం చేసుకున్న అర్హులైన 616 జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 4,82,15,000లను మెగా చెక్కు రూపంలో కలెక్టర్ విజయ రామరాజు అతిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు, చదువును ప్రోత్సహించడం కోసం పదో తరగతి నిబంధనను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేసి లబ్ధిదారులకు కల్యాణమస్తు, షాదీ తోఫాలను పెళ్లి కుమార్తె తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇబ్రాన్, కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్యలు పాల్గొన్నారు.

కల్యాణమస్తు సాయం ఉపయోగపడింది



మాకు ప్రభుత్వం నుంచి కల్యాణ మస్తు సహాయం అందడం చాలా సంతోషంగాఉంది. నా కుటుంబానికి జగనన్న విద్య దీవెన, వసతి దీవెన, డ్వాక్రా రుణ మాఫీ సాయం కూడా అందుతోంది. అత్తారింట్లో కూడా వేర్వేరు పథకాలు అందుతున్నాయి. జగన్ సార్ అందిస్తున్న కల్యాణ మస్తు సాయం మా కుటుంబానికి ఎంతో ఉపయోగ పడుతోంది.

-ఎస్.సుప్రజ దంపతులు, చెమ్ముమియా పేట, కడప

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



కల్యాణమస్తు పథకం ద్వారా ప్రభుత్వ సాయాన్ని పొందడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలో అమ్మ ఒడి, కల్యాణ మస్తు ప్రభుత్వ సాయం అందుతున్నాయి. జగనన్న హౌసింగ్ పథకం కూడా అందింది. అంతే కాకుండా నా లాంటి వారికి ఇలాంటి ప్రభుత్వ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రికి మా కుటుంబం రుణపడి ఉంది.

- బి.భాగ్యలక్ష్మి దంపతులు, ఏఎల్ కాలనీ, కడప

ప్రభుత్వానికి ధన్యవాదాలు



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. అంతేకాకుండా వివాహం కోసం మా తల్లిదండ్రులు పడే ఆర్థిక ఇబ్బందులను గుర్తించడం చాలా గొప్ప విషయం . మా కుటుంబంలో వైఎస్ఆర్ చేయూత, అమ్మ ఒడి పథకాలు అందుకుంటున్నాం. అన్ని వర్గాల ప్రజలకు అవసరం అయిన అన్ని వసతులను సమకూరుస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- ఎస్. సాహిరా దంపతులు, పెద్దమట్టిపులి వీధి, కడప

తల్లిదండ్రులకు ఆసరా



మాలాంటి పేదలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణమస్తు పథకం లబ్ధి మా తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరాను ఇస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సాయం అందించలేదు. కొత్త జీవితం ప్రారంభించిన మాకు జగన్ సార్ అందించిన కల్యాణ మస్తు సాయం మా పాలిట దేవుడిచ్చిన కానుకగా భావిస్తున్నాం. - సి.ధనలక్ష్మి దంపతులు, శాటిలైట్ సిటీ, కడప

వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్ లో మిషన్ ఇంద్రధనష్-ఇమ్యునైజేషన్ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ, జంతు సంబంధ వ్యాధులు, వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యం టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, మహిళలకు ఎనీమియా డెఫిషియన్సీ తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. మహిళల్లో ఎనీమియా గుర్తింపులో ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓల సహకారంతో వయస్సు వారీగా గుర్తించాలన్నారు. పిల్లలకు పూర్తి రోగనిరోధక శక్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుకోవాలన్నారు. వాయు కాలుష్యం, ఆరోగ్య ప్రభావాలపై బుక్‌లెట్‌ను, జంతు సంబంధ వ్యాధులు మానవ ఆరోగ్యంపై బ్రోచర్లను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్,జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, పశు సంవర్ధకశాఖ జేడీ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

- లబ్ధిదారులందరికీ అంగన్వాడీ సేవలను అందించాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భవతి సేవలు పొందేలా చూడాలన్నారు. గర్భిణీకి, 0-6 సంవత్సరాల బాలబాలికలకు సేవలు అందించాలన్నారు. ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. టేక్ హోం రేషన్ లబ్ధిదారులకు అందించాలన్నారు. బాలలకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌పై దృష్టి సారించాలన్నారు. బాలలపై జరుగుతున్న లైంగిక దాడులపై పోక్సో కేసులు నమోదు చేయాలన్నారు.

పేరెంట్స్ కమిటీ.. బడి ప్రగతికి దివిటీ

- పాఠశాలల్లో తల్లితండ్రుల భాగస్వామానికి కృషి
- నేడు ప్రభుత్వ బడుల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు



మున్సిపల్ హైస్కూల్లో పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో విద్యార్థుల వివరాలు...

మేనేజ్‌మెంట్	పాఠశాలలు	విద్యార్థులు
గవర్నమెంట్	2000	1,38,668
ఎయిడెడ్	67	7886
ప్రైవేట్	775	1,67,142
మొత్తం	2842	3,13,696

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇప్పటికే నాడు- నేడు పనుల్లో భాగస్వామ్యం చేసి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేసింది.తాజాగా పిల్లలకు సంబంధించిన బోధనాభ్యాస ప్రమాణాల పెంపు అంశాల్లోనూ భాగస్వాములను చేస్తూ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. 2023-24 విద్యా సంత్సరానికి విద్యార్థుల అభ్యర్థన సామర్థ్యాలను తెలియచేసేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 10వ తేదీ గురువారం పేరెంట్స్- టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి, తరగతిలో వారి పరిస్థితిని తల్లిదండ్రులకు తెలిపేందుకు ఈ సమావేశాలు ముఖ్య పాత్ర పోషించనున్నాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు జరిగాయి. వారం లోపే మూల్యాంకనం పూర్తి చేసి అదే వారంలో అన్ని పాఠశాలల్లో సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పిల్లలు ఎలా చదువుతున్నారు.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించనున్నారు. పేరెంట్, టీచర్స్ సమావేశాలకు విద్యాశాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 2842 ప్రభుత్వ బడులు ఉన్నాయి.ఇందులో 3,13,696 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నానరు.

ఇవీ సూచనలు: సమావేశానికి విద్యార్థుల తల్లితండ్రులు హాజరయ్యేలా చూడాలి.

- హెచ్‌ఎం పర్యవేక్షణలో క్లాస్ టీచర్, పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి
- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలో వచ్చిన మార్కులు, విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేసి, విద్యార్థి అభివృద్ధికి సంబంధించి సలహాలు అందించాలి
- సమావేశంలో చర్చించిన అంశాలను హెచ్‌ఎంలు, క్లాస్ టీచర్ రికార్డు చేసి మినిట్స్ తయారు చేయాలి

ప్రయోజనాలు: క్రమం తప్పకుండా చర్చలు జరపడం వల్ల విద్యార్థి పురోగతికి సంబంధించి అందాల్సిన సహకారం, పాఠ్యపుస్తకాల వినియోగం గురించి తెలుసుకునేందుకు వీలవుతుంది. పాఠశాలల అభివృద్ధి, విద్యాపరమైన పురోగతిలో తల్లితండ్రులు బాగస్వాముతవుతారు.

- పిల్లల హాజరు, ప్రవర్తనలో మార్పులు చేటుచేసుకునే అవకాశం ఉంటుంది.
- మధ్యాహ్న భోజనం అమలు తీరును తల్లిదండ్రులు స్వయంగా పర్యవేక్షించవచ్చు.

అన్ని మండలాల్లో నిర్వహించాలి



అన్ని మండలాల్లో షెడ్యూల్ ప్రకారం పేరెంట్- టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలి.ఈ విషయంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అలసత్వం వహించొద్దు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సీబీఏ-1 పరీక్షల తర్వాత ఈ ఏడాదిలో 10న సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. అందరూ హాజరుకావాలి.- ఎ ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లాపథక అధికారి

అందరి భాగస్వామ్యం ఉండాలి



పాఠశాలల అభివృధిలో అందరి భాగస్వామం ఉండాలి. ఇది విన్నూతమైన కార్యక్రమం. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సమావేశాల నిర్వహణకు సూచనలిచ్చాం. ఇందులో క్లాస్ టీచర్ మినిట్స్ బుక్‌ను తప్పని సరిగా నిర్వహించాలి.

- రాఘవరెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి

పట్టాలు తప్పిన నంద్యాల డెమో




పట్టాలు తప్పిన నంద్యాల డెమో రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప-నంద్యాల మధ్య తిరిగే నంద్యాల డెమో బుధవారం పట్టాలు తప్పింది. నంద్యాల నుంచి ఉదయం 9.40 గంటలకు ఈ రైలు వైఎస్సార్ జిల్లా కడపకు చేరుకుంది. ఇక్కడి యాడ్‌లోని 5వ నంబరు ప్లాట్‌ఫాంలో ఉంచారు. తిరిగి సాయంత్రం 5 గంటల సమయంలో రైలు నంద్యాల వెళ్లేందుకు కడప రైల్వేస్టేషన్‌లోని మూడోప్లాట్‌ఫాం పైకి తీసుకు రావాల్సి ఉంది. అయితే ఐదో ప్లాట్‌ఫాం నుంచి నాలుగో ప్లాట్‌ఫాంకు వస్తుండగా రైలు పట్టాలు తప్పింది. అయితే ఆ సమయంలో రైలులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కడప రైల్వే అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనలతో ఈ రైలును పట్టాలు ఎక్కించే ప్రయత్నాలు సాగించారు. సాధారణంగా సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు రాత్రి 9.00 గంటల వరకు కూడా పట్టాలపైకి చేర్చలేకపోయారు. పట్టాలు తప్పిన కారణంగా నంద్యాల డెమో రైలును రద్దు చేశారు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఆదివాసీలకు అండగా ప్రభుత్వం

ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. బుధవారం కడపలోని ఎస్టీ గురుకుల్ స్కూల్లో ఆల్ ఇండియా బంజారా సేవ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ,మైనార్టీ శాఖ మంత్రి అంజాద్‌బాషా పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు ఆదివాసీలు అంటే కొండ ప్రాంతంలో మాత్రమే నివసించే వారని, ప్రస్తుతం వారు ఆధునిక సమాజంలో భాగస్వాములు చేయడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కుల కోసం ఎన్నో చట్టాలు తీసుకురావడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అనేక విప్లమాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆదివాసీ పిల్లలు చదువులు మధ్యలో నిలిపివేయకుండా బాగా చదువుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ఆదివాసీల్లో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టాలని చెప్పారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పిల్లలను బడికి పంపితే చాలు తల్లి అకౌంట్లో రూ 15 వేలు జమ చేస్తోందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాలలో నివసించే వారికి 200 యూనిట్ల వరకు విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఆదివాసీలందరికీ ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అరకులో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ జగన్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర నాయక్, వైఎస్సార్సీపీ వైద్య విభాగ అధ్యక్షులు శివ నాయక్, వైఎస్సార్సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, గురుకుల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి,ఎస్సీ కార్పొరేషన్, డిస్టిక్ ట్రైబెల్ వెల్ఫేర్ డా.వెంకటసుబ్బయ్య, మార్కెట్ చైర్మన్ బంగారు నాగయ్య, పూసల భలిజ స్టేట్ డైరెక్టర్ విజయకుమారి,ఎస్టీసెల్ నగర అధ్యక్షులు రమణ ఎస్టీ సెల్ ,నగర కార్యదర్శి కష్ణ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

గత కాలపు ఆనవాళ్లు.. ఆదివాసీలు: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్లుగా ఆదివాసులు నిలిచారని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంతో సంబంధం లేకుండా ఇప్పటికీ చాలా తెగలు సమష్టి జీవన పద్ధతులు, సహజీవనం సాగిస్తూ పారదర్శకతకు నిలువెత్తు సాక్షులుగా నిలుస్తున్నారన్నారు. ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఇవి వారి జీవితాల్లో గుణాత్మక మార్పుకు దోహదం చేస్తున్నాయన్నారు. జేసీ గణేష్ కుమార్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి. శివ ప్రసాద్ రెడ్డి, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డిస్టిక్ ట్రైబల్ వేల్ఫేర్ ఇన్‌చార్జ్ డాక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పిచ్చికుక్క వీరంగం

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. పాన్నేటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెలో ఓ పిచ్చికుక్క వీరంగం సృష్టించి కనపడిన వారందరినీ వెంటపడి కరిచి గాయాలపాలు చేసింది. పిచ్చికుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన పలువురు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చారు. వారిలో సాయిగోపాల్‌రెడ్డి, కృష్ణమ్మ, పవన్, రామిరెడ్డి, పావని, సుధాకర్ తదితరులు ఉన్నారు. కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లో పిల్లలకు మందుల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యా, వైద్య ఆరోగ్యశాఖ
- నేడు కడప గాంధీనగర్ స్కూల్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం, కలెక్టర్, నగరపాలక కమిషనర్



రకరకాల నులిపురుగులు

కడప ఎడ్యుకేషన్ : కంటికి కనిపించని శత్రువు.. ఒంటికి హాని కలిగించే రుధిర పురుగు నులిపురుగు. ఇది మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చిపిప్పి చేస్తూ రక్తహీనతను కలిగిస్తుంది. నులి పురుగులు అధికశాతం అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీని నివారణకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 10వ తేదీన అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలలో విద్యనభ్యసిస్తున్న వారికి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్యశాఖాధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మాత్రలను ఇప్పటికే అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలకు తరలించారు. ఈ మేరకు జిల్లాస్థాయి కార్యక్రమాన్ని కడపలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, డీఎం అండ్‌హెచ్‌ఓ నాగరాజు హాజరు కానున్నారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికి ఈ నులిపురుగులను నివారించే మాత్రలను వేయనున్నారు.

వ్యాప్తి ఇలా...

కలుషిత ఆహారం, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన పదార్థాలు తినడం వలన నులిపురుగులు వ్యాప్తిస్తాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం ద్వారా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరుకులు, శుభ్రమైన నీటితో కడగకపోవడం వలన, భోజనం వండేవారు, వడ్డించేవారు తినేముందు, తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడక్కపోవడం వల్ల, చేతివేళ్లకు గోర్లు ఉండటం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాల్లో పిల్లలు ఆడుకోవడం వల్ల కూడా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం లేకపోలేదు.

బాల్యం చిక్కిపోతోంది..

నులి పురుగుల కారణంగా అందమైన బాల్యం చిక్కిపోతోంది. రోగాలతో బాల్యం సతమతమవుతోంది. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 4,71,835 మంది ఉన్నారు. ఇందులో 1 సంవత్సరం నుంచి 2 సంవత్సరాల పిల్లలకు (అంగన్‌వాడీ కేంద్రంలోని) ఆల్‌బెండజోల్ 400 ఎంజీలో అర్ధ మాత్రను పొడి చేసి గ్లాస్‌నీళ్లలో కలిపి తల్లి సమక్షంలో మధ్యాహ్నం భోజనం తరువాత తాగించాలి. ఆ తర్వాత నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీ పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత నీళ్లలో మింగించాలి. భోజనం చేయకుండా మాత్రను వేసుకుంటే కడుపునొప్పి,వాంతులు, అయ్యే అవకాశం ఉంది. అలాగే విద్యార్థులకు జ్వరం లేదా ఇతర కారణాల వలన అనారోగ్యంగా ఉన్నప్పుడు వారికి ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలు ఇవ్వకూడదు.

ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమాలు..

- ఈ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం పై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్యశాఖ అధికారులు స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు ముందుగా అవగాహన కల్పించాలి.
- పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో ప్రార్థన సమయంలో ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రల ఆవశ్యకతను వివరించడంతోపాటు చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించాలి.
- ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రలు పాఠశాల సమయంలో మాత్రమే విద్యార్థులకు అందజేయాలి. ఒక వేళ విద్యార్థులు ఎవరైనా ఆ రోజు పాఠశాలకు హాజరు కానట్లయితే వారి ఇంటికి మాత్రలు చేర్చి విద్యార్థికి అందేలా చూడాలి.

నులిపురుగుల నిర్మూలన వల్ల ప్రయోజనాలు..

- పిల్లలో రక్తహీనత నియంత్రిస్తుంది.
- వ్యాధి నిరోధకతను మెరుగు పరుస్తుంది.
- ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం పెరుగుతుంది.
- పని సామర్థ్యాన్ని పెంచి జీవన భృతి అవకాశాన్ని పెంచుతుంది.

జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు వాటిలో విద్యార్థుల వివరాలు ఇలా...

యాజమాన్యం	కళాశాలలు, పాఠశాలల సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం పిల్లలు
అంగన్‌వాడీ	2401	59476	56875	116351
ప్రభుత్వ స్కూళ్లు	1963	78050	84860	162910
ప్రైవేటు స్కూళ్లు	475	73359	67294	140653
ప్రభుత్వ కాలేజీలు	50	6045	9106	15151
ప్రైవేటు కాలేజీలు	50	9651	10400	20051
పాలిటెక్నిక్	08	2911	1420	4331
ఐటీఐ	09	990	38	1028
డిగ్రీ కళాశాలలు	29	3187	5052	8239
బడిబయట పిల్లలు		0	3121	3121
మొత్తం	4985	233669	238166	471835

ప్రతి పాఠశాలలో...



జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రలను ఇవ్వాలి. ఈ విషయంలో వైద్య శాఖ, విద్యాశాఖ సమన్వయంతో పిల్లలకు మాత్రలను పంపిణీ చేయాలి. అన్ని జాగ్రత్తలను పాటిస్తూ పిల్లలతో మాత్రలను మింగించాలి. ఏదైనా తేడా అనిపిస్తే తక్షణం వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



పిల్లల్లో నులి పురుగుల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపట్టింది. ఈ పురుగుల నివారణకు ఆల్‌బెండోజోల్ 400 ఎంజీ ఒక మాత్ర 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్రను నలిపి వేయాలి. 3 ఏళ్ల నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర చొప్పున వేయాలి. ఈ ఆల్‌బెండోజోల్ మాత్రలను ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలకు సరఫరా చేశాం. ఏదేని కారణాలతో మాత్రలు వేసుకోనివారికి 17వ తేదీన వేస్తాం.

– డాక్టర్ కె. నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి.

కొండాపురంలో చెల్లని చెక్కు కలకలం

కొండాపురం : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకులో ఓ చెల్లని చెక్కు కలకలం రేపిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు.. మంగళవారం కొండాపురంలోని స్టేట్‌బ్యాంకుకు ఓ వ్యక్తి వచ్చి తన వద్ద ఉన్న బ్లాంకు చెక్కును అధికారులకు చూపి ఈ అకౌంటులో రూ.40 కోట్లు ఉన్నాయేమో పరిశీలించమని కోరాడు. అంత పెద్దమొత్తం గురించి సదరు వ్యక్తి ఆరా తీయడంతో అనుమానం వచ్చిన బ్యాంకు సిబ్బంది ఆ చెక్కును పరిశీలించగా అది చెల్లని చెక్కుగా గుర్తించారు. దీంతో ఆ వ్యక్తి వెంటనే అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయాన్ని సిబ్బంది బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై కొండాపురం పోలీసులను వివరణ కోరగా అధికారికంగా ఇంతవరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈ సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

బంగారు, వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

పోరుమామిళ్ల : పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనాలకు సంబంధించిన నేరస్తులను పట్టుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలో సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరుకు చెందిన రత్నరాజు, హైదరాబాద్‌కు చెందిన కళ్యాణ్‌కుమార్, బ్రహ్మయ్య, సందీప్ మే నెలలో కాపువీధిలోని ఓబుల్‌రెడ్డి ఇంట్లో, ఆంటోనీస్ స్కూల్ దగ్గర రెండు దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. వీరంతా జైలులో కలుసుకుని ముఠాగా ఏర్పడ్డారన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో కరడుకట్టిన నేరాలు చేసే నిందితులుగా వారిపై కేసులు నమోదయ్యాయన్నారు. హిందూపురం, రాజంపేట, కొమరోలు తదితర ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె సమీపంలోని దూదెమ్మకోన దగ్గర ఉన్నట్లు సమాచారం రావడంతో బుధవారం వారిని సీఐ, ఐడీ పార్టీతో వెళ్లి అదుపులోకి తీసుకున్నారన్నారు. వారినుంచి 10 తులాల బంగారు నగలు, కేజీ వెండి వస్తువులు, హోండా మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

ఖాజీపేట : ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన ఎల్లాల నరసింహులు(45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన అక్కయ్యకు అనంతపురం జిల్లా వెల్లాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన వెల్లాల నరసింహులుతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదుగురు పిల్లలు. వీరు గత కొంతకాలంగా ముత్తులూరుపాడులో నివాసం ఉంటున్నారు. కుటుంబ పోషణ కోసం అక్కడక్కడా అప్పులు చేశారు. అవి తీర్చడం కష్టతరంగా మారింది. దీనికి తోడు కుటుంబంలో వచ్చిన చిన్న చిన్న కలహాల కారణంగా నరసింహులు మద్యానికి బానిసయ్యాడు. తరచూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. పురుగుల మందు తీసుకుని పలుమార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు భార్య తెలిపింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భూమాయపల్లె సమీపంలోని జాతీయ రహదారి బ్రిడ్జి కింద మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ప్రాణాలు వదిలాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య అక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ మోటార్లు, వైర్లు చోరీ

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పలువురు రైతుల వ్యవసాయ బోర్లకు అమర్చిన వ్యవసాయ పనిముట్లు, మోటార్ వైర్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుని వెళ్లారు. అలాగే ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు తాగునీరు సరఫరా చేసే బోరుబావికి విద్యుత్ సరఫరా చేసే వైర్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

వర ప్రసాదినిలా వైఎస్సార్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్



గాలివీడు : తాగునీరు, సాగురు అందించే వరప్రసాదినిలా వైఎస్సార్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మారిందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కుడికాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా దేవుడి దయతో సకాలంలో వర్షాలు కురవడంతో కాలువల ద్వారా నీటి విడుదల చేసే అవసరం రాలేదన్నారు. ఈ ఏడాది వర్షాలు కొంచెం ఆలస్యం కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే సంకల్పంతో కుడి కాలువలో ఏర్పడ్డ పూడికలు, చిన్న చిన్న మరమ్మతులను ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే సమయంలో సకాలంలో రైతులకు సాగు నీటిని అందించేందుకు ముందు చూపుతో నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చిట్వేలి/రాజంపేట : రైల్వేకోడూరు-చిట్వేలి రోడ్డులో గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిడిపాటి సన్నీ (23) బుధవారం మృతి చెందాడు. బైకుపై వెళుతున్న సన్నీని టెంపో వాహనం(ఏపీ 39యుఎన్-8693) డ్రైవర్ అజాగ్రతగా నడిపి ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిట్వేలి కేఎస్ అగ్రహారానికి చెందిన తమిడిపాటి గంగాధరం, దేవి దంపతుల పెద్దకొడుకు సన్నీ. ఇటీవల మృతుని తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లారు. కువైట్ నుంచి వచ్చిన తర్వాత మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు చిట్వేలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్యే సంతాపం

చిట్వేలి కేఎస్ అగ్రహారం దళితవాడలో బలమైన వర్గం కలిగిన తమిడిపాటి కుటుంబానికి చెందిన యువకుడు మృతి చెందడంతో రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో సన్నీని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కానీ చివరికి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు.

ఇద్దరు మహిళా దొంగలు అరెస్ట్

రూ. 2లక్షల విలువైన నాలుగు తులాల బంగారు, 42 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం


మహిళా దొంగల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళా దొంగలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2లక్షలు విలువైన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 42 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ ఎన్.వి.నాగరాజు వివరాలను వెల్లడించారు.

ఈ ఏడాది జనవరి 30న చిత్తూరు జిల్లా విజయపురి మండలానికి చెందిన ముదిరెడ్డి మల్లీశ్వరి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన అత్తగారి ఊరైన పెండ్లిమర్రి మండలం, మర్రిమాకుల పల్లెకు వెళ్లేందుకు కడపకు వచ్చింది. ఆ ఊరికి వెళ్లేముందు తన బిడ్డలకు దుస్తులు కొనేందుకు తన తండ్రితో కలిసి వై.వి స్ట్రీట్‌కు వెళ్లింది. అక్కడ తన బిడ్డల దుస్తుల కోసం షాపింగ్ చేసి, వై.వి స్ట్రీట్‌లో ఉన్న వేపచెట్టు వద్ద తన తండ్రి కోసం వేచి ఉంది. ఇంతలో ఎవరో గుర్తు తెలియని దొంగలు తన భుజానికి ఉన్న బ్యాగ్‌ను కత్తిరించి అందులో ఉన్న 7 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ. 7000 నగదును దొంగిలించుకుని వెళ్లారు. దీంతో ఆమె అదే నెల 31న కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిలో భాగంగా తమకు వచ్చిన సమాచారం మేరకు కడప రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కర్నూలు జిల్లా సిద్ధాంతపురానికి చెందిన తమ్మిశెట్టి వాణి, గుంటూరు జిల్లా బాపట్ల మండలం , అరవపాలెం గ్రామానికి చెందిన గోదారి బుజ్జి ఉన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, ఎస్ఐ సిద్ధయ్య, ఏఎస్ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు ఖాదర్, బాషాలను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ సునీల్

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలం రామిరెడ్డి కొట్టాలు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేటకు చెందిన సునీల్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు సునీల్ రాజంపేట నుంచి గుంతకల్లుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రామిరెడ్డి కొట్టాలుకు చెందిన వెంకట శివ కారులో కడప వైపు వెళుతున్నాడు. రామిరెడ్డి కొట్టాలు సమీపంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న సునీల్ తీవ్రంగా గాయపడగా, కారు నడుపుతున్న వెంకట శివ స్వల్పంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను వల్లూరు 108 వాహనంలో చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా అదే సమయంలో కడప నుండి కమలాపురం ప్రయాణిస్తున్న రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను ఆరా తీశారు. క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించారు.

జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలంటూ మొక్కు


అలిపిరి వద్ద టెంకాయలు కొడుతున్న కాపునాడు నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ 2024లో భారీమెజార్టీతో తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ కాపునాడు ఆధ్వర్యంలో తిరుపతిలోని అలిపిరి మెట్టుమార్గం వద్ద 108 టెంకాయలు కొట్టారు. కాపునాడు అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు ఆకులరవి, కావలి కృష్ణతేజ (ఇడుపులపాయ తేజ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కాపునాడు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని తిరుమల మెట్ల వద్ద టెంకాయలు కొట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్. హేమలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.